# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ | గురువారం జూన్ 25 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో రూ.1.22 కోట్ల మోసం.. ఆరుగురు అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడుల పేరుతో భారీ సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యుల ముఠాను హైదరాబాద్ సైబర్ నేరాల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠా వలలో పడి ఓ వ్యక్తి రూ.1.22 కోట్లు నష్టపోయినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల్లో ఐదుగురు మహారాష్ట్రకు చెందినవారు కాగా, ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని ఈ ఏడాది జనవరిలో ఓ సందేశాల సమూహంలో చేర్చి అధిక లాభాలు, ప్రారంభ వాటాల కేటాయింపుల పేరుతో ఆకర్షించారు. నకిలీ పెట్టుబడి వేదికల ద్వారా డబ్బులు పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెట్టారు. బాధితుడిలో నమ్మకం కలిగించేందుకు తొలుత రూ.1.05 లక్షలు వెనక్కి తీసుకునే అవకాశం కల్పించారు. దీంతో నమ్మిన బాధితుడు 19 విడతల్లో మొత్తం రూ.1,22,18,029 పెట్టుబడిగా చెల్లించారు.ఆ తర్వాత అతని ఖాతాలో రూ.15.69 కోట్ల లాభం వచ్చినట్లు నకిలీ వివరాలు చూపించి, వాటాల విడుదల పేరుతో మరో రూ.35 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.సైబర్ నేరాల విభాగం అధికారులు చేపట్టిన దర్యాప్తులో నిందితులు నకిలీ సంస్థలు ఏర్పాటు చేసి, బ్యాంకు ఖాతాలు తెరచి, వాటి వివరాలను ఇతరులకు అందజేస్తూ కమీషన్లు పొందుతున్నట్లు గుర్తించారు. పలు బ్యాంకు ఖాతాలకు దేశవ్యాప్తంగా అనేక సైబర్ మోసాల కేసులతో సంబంధాలు ఉన్నట్లు తేలింది.

### తుంగభద్ర నీటి వాటా కోసం
# కేంద్రం జోక్యం చేసుకోవాలి

**సీఎం రేవంత్ రెడ్డి**

**ఆర్డీఎస్ ఆధునికీకరణ, పూడికతీత పనులపై**

**'జలసౌధ'లో ఉన్నతస్థాయి సమీక్ష!**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తుంగభద్ర నది నుంచి తెలంగాణకు దక్కాల్సిన నికర వాటా జలాల పూర్తి వినియోగానికి, భాగస్వామ్య రాష్ట్రాల మధ్య సమన్వయ సాధనకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తుంగభద్ర ప్రాజెక్టు, రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపై బుధవారం ఆయన జలసౌధలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**హక్కుగా రావాల్సిన 15.9 టీఎంసీలు ఎక్కడ?**

తుంగభద్ర డ్యామ్, నది ప్రవాహం నుంచి తెలంగాణకు హక్కుగా 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా.. ప్రస్తుతం ఐదారు టీఎంసీలకు మించి రావడం లేదని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ కింద జోగులాంబ గద్వాల జిల్లాలోని దాదాపు 75 గ్రామాల్లో 83,987 ఎకరాల ఆయకట్టుకు నీరందాల్సి ఉందన్నారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు ఇందులో భాగస్వామ్యం ఉన్నందున.. నీటి వాటాల సమర్థ వినియోగానికి కేంద్ర జల సంఘం (జసౌజ) సారథ్యంలో తుంగభద్ర బోర్డును మరింత పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**నిలిచిపోయిన ఆర్డీఎస్ పనులు..**

ఆర్డీఎస్ ఆనకట్ట ప్రస్తుతం ప్రమాదకరంగా మారిందని, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన పనులను అత్యవసరంగా గుర్తించాలని సీఎం ఆదేశించారు. ఆర్డీఎస్ ఆధునికీకరణకు సంబంధించి ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రూ.59 కోట్లు డిపాజిట్ చేసినప్పటికీ పనులు పూర్తి కాలేదన్నారు. ప్యాకేజీ 3, 4 పనులు పూర్తయినా.. ప్యాకేజీ 1, 2 పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. దీనిపై రేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిగే సమావేశంలో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించాలని సీఎం నిర్ణయించారు.

**కర్ణాటక సహకారంతో పూడికతీత**

ఆర్డీఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు పూడిక నిండిపోవడం వల్ల నీటి మళ్లింపు సాధ్యం కావడం లేదని ఇంజనీర్లు తెలిపారు. 2004లోనే నిపుణుల కమిటీ పూడిక తొలిగించాలని సిఫారసు చేసినా ఇప్పటికీ అమలు కాలేదని చర్చించారు. పూడిక పేరుకున్న భూభాగం కర్ణాటకలో ఉన్నందున.. ఆ రాష్ట్ర సహకారంతో వెంటనే పూడికతీత పనులు చేపట్టేలా కేంద్రాన్ని కోరాలని, ప్రస్తుత వాస్తవ పరిస్థితులతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

**మల్లమ్మకుంట రిజర్వాయర్ సామర్థ్యం పెంపు**

తుంగభద్ర ఎత్తిపోతల పథకంలో భాగంగా గరిష్ఠంగా నీటిని వినియోగించుకునే ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని సీఎం సూచించారు. తుమ్మిళ్ల నుంచి నీటిని సమర్థంగా వాడుకునేందుకు వీలుగా కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కెపాసిటీని పెంచాలని, ఈ పనులను వీలైనంత వేగంగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# నేటి నుంచి సర్




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ప్రతిష్టాత్మక ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. భవిష్యత్తు ఎన్నికలకు అత్యంత కీలకమైన ఈ ఓటర్ల జాబితా సవరణపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఈ ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా ఉండేలా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తోంది. ఈ నేపథ్యంలో నేడు గాంధీభవన్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరుకానున్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, తదుపరి సార్వత్రిక ఎన్నికలకు ఈ ఓటర్ల జాబితానే ప్రాతిపదిక కానుండటంతో ప్రభుత్వం ఈ ప్రక్రియను అత్యంత కీలకంగా భావిస్తోంది. వలస వెళ్లిన వారు, పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీల ఓట్లు పొరపాటున తొలగించబడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు)తో సమన్వయం చేసుకుంటూ అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయడం, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు అంశంపై కూడా చర్చ జరగనుంది. ఎన్నికల సంఘం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమ ఓటు వివరాలను పరిశీలించి, అవసరమైతే సవరణలు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఒక్కో

**ఓటరుకు విడివిడిగా ఎన్యుమరేషన్ ఫారం**

ఇంటింటి గణనలో భాగంగా బీఎల్?వోలు ఒక కుటుంబంలో ఎంత మంది ఓటర్లు ఉంటే.. అంత మందికీ విడివిడిగా ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారు. ఓటరు ఈ ఫారానికి తన పాస్?పోర్ట్ సైజ్ ఫొటోను జత చేయాలి. అందులో పుట్టిన తేదీ, ఆధార్ కార్డు నెంబర్, ఫోన్ నెంబర్, తల్లిదండ్రుల వివరాలు, వారి ఓటు హక్కు వివరాలను స్పష్టంగా నింపి బీఎల్‌వోలకు అందజే యాల్సి ఉంటుంది. లేదా నేరుగా ఎన్నికల సంఘం అధికారిక యాప్?లో కూడా ఈ వివరాలను అప్లోడ్ చేయవచ్చు.

ఒకవేళ బీఎల్‌వోలు వచ్చే సమయంలో ఇంట్లో లేని పక్షంలో.. ఓటర్లు VOTERS.ECI.GOV.IN వెబ్‌సైట్ నుంచి ఫారం డౌన్ లోడ్ చేసుకుని, జూలై 24 లోగా వివరాలను అప్లోడ్ చేయాలి. అనంతరం వచ్చే ఎక్నాలెడ్జిమెంట్?ను బీఎల్?వోలకు అందజేయాల్సి ఉంటుంది. ఈ ఫారాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఓటును నిర్ధారిస్తారు.

హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల పరిధిలో గల 4,062 పోలింగ్ స్టేషన్లలో మొత్తం 47,36,669 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఇప్పటికే 22 లక్షల 9 వేల 647 మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి అయింది.




## పాస్‌పోర్ట్ ప్రయాణ పత్రం మాత్రమే

**పౌరసత్వ నిరూపణ కాదు**

**విదేశాంగ శాఖ**

**ఆధార్ గుర్తింపు కార్డు మాత్రమేనన్న సుప్రీంకోర్టు..**

**దేశంలో పౌరసత్వ ఆధారాలపై మళ్లీ చర్చ!**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పాస్‌పోర్ట్ అనేది కేవలం అంతర్జాతీయ ప్రయాణాల కోసం ప్రభుత్వం జారీచేసే ఒక ప్రాథమిక పత్రం మాత్రమేనని, అది పౌరసత్వాన్ని ధృవీకరించే నిరూపణ పత్రం కాదని కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఈఏ) స్పష్టం చేసింది. సాధారణంగా భారత పౌరులకే పాస్‌పోర్టును జారీ చేసినప్పటికీ.. చట్టప్రకారం అది పౌరసత్వాన్ని నిర్ధారించే పత్రం కిందకు రాదని పేర్కొన్నది. 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా విదేశాంగ శాఖ జారీచేసిన ఈ అధికారిక ప్రకటన దేశంలో పౌరసత్వానికి కచ్చితమైన ఆధారాలు ఏవనే అంశంపై మరోమారు విస్తృత చర్చకు దారితీసింది.

**అది ప్రభుత్వ ఆస్తి మాత్రమే:**

విదేశాంగ శాఖ తన ప్రకటనలో.. పాస్‌పోర్ట్ అనేది అంతర్జాతీయ ప్రయాణాలను సులభతరం చేయడం కోసం ప్రభుత్వం జారీ చేసే ప్రయాణ పత్రం (ట్రావెల్ డాక్యుమెంట్) మాత్రమేనని స్పష్టం చేసింది. అంతేకాకుండా పాస్‌పోర్ట్ అనేది భారత ప్రభుత్వ ఆస్తి అని, ప్రభుత్వం ఆదేశించినప్పుడు లేదా చట్టపరమైన అవసరాలు ఏర్పడినప్పుడు దానిని తిరిగి అప్పగించాల్సి ఉంటుందని గుర్తుచేసింది.

ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం 'ఆధార్ కార్డు' అనేది పౌరసత్వానికి కచ్చితమైన నిరూపణ కాదని, అది కేవలం ఒక వ్యక్తి గుర్తింపు మరియు నివాస ధృవీకరణ పత్రం మాత్రమేనని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు విదేశాంగ శాఖ పాస్‌పోర్ట్‌పై కూడా ఇదే విధమైన ప్రకటన చేయడంతో.. దేశంలో అసలు పౌరసత్వానికి సరైన, తిరుగులేని చట్టపరమైన ఆధారం ఏమిటంటూ పలువురు సామాన్యులు, మేధావులు సందేహాలు వ్యక్తపరుస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పౌరసత్వ చట్టాలపై స్పష్టత రావాల్సిన అవసరముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ హై అలర్ట్

**జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ సీరియస్ హెచ్చరికలు!**

**నిర్లక్ష్యం వహిస్తే ఇన్‌ఛార్జ్‌ల తొలగింపు తప్పదు.. ప్రతి అర్హత గల ఓటును కాపాడటమే లక్ష్యం!**


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి/ఈనాడు ప్రతినిధి): రాష్ట్రంలో రేపటి నుంచి ప్రారంభం కానున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (రాక్ష్మీక్ష్మ) కార్యక్రమాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా పేదలు, బడుగు బలహీన వర్గాలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని పార్టీ నాయకత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన అత్యవసర జూమ్ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ లు పాల్గొని పార్టీ శ్రేణులకు గట్టి దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్?లు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోం: సీఎం రేవంత్ రెడ్డి**

జూమ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ (రాక్ష్మీక్ష్మ) ప్రక్రియను నాయకులు పూర్తి సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల సవరణ విషయంలో కొందరు ప్రజాప్రతినిధులు, ఇన్‌ఛార్జ్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "జిల్లాల వారీగా నిర్వహించిన అవగాహన సదస్సుల పూర్తి నివేదికలు నా వద్ద ఉన్నాయి. ఎవరెవరు నిర్లక్ష్యం చేస్తున్నారో పేర్లతో సహా చెప్పగలను. పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు" అని హెచ్చరించారు. ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించే ఇన్‌ఛార్జ్‌లను తక్షణమే తొలగించి కొత్తవారిని నియమిస్తామని, మరో 10 రోజులు వేచి చూసి పనితీరు మారకుంటే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గ్రామాల్లో సర్పంచ్‌ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇన్?ఛార్జ్ మంత్రులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు.

## కరీంనగర్ జిల్లాలో కారు గుర్తు సునామీ ఖాయం



**కాంగ్రెస్, బీజేపీల కుట్రలను ఎండగట్టండి.**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట కేటీఆర్**

**ఉమ్మడి జిల్లా నేతలకు దిశానిర్దేశం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కరీంనగర్ ఉమ్మడి జిల్లా అనాదిగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి తిరుగులేని కోట అని, రాబోయే రోజుల్లో అక్కడ మళ్లీ 'కారు' గుర్తు సునామీ సృష్టించడం ఖాయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు (కేటీఆర్) ధీమా వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ సుదీర్ఘంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులు, పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ (రాక్ష్మీక్ష్మ) ఓటర్ల సవరణ ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకుని, సమకాలీన రాజకీయాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు.

**అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ మోసం**

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అడ్డగోలు హామీలు, మోసపూరిత మాటల వల్లే కరీంనగర్ జిల్లాలో కొన్ని స్థానాలను కోల్పోవాల్సి వచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ పార్టీ రెండున్నర సంవత్సరాల విఫల పరిపాలనను ప్రజలు చూశారు. ఇప్పుడు మళ్లీ అందరూ బీఆర్ఎస్ వైపు, పార్టీ అధినేత కేసీఆర్ వైపు చూస్తున్నారు. పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేల్లోనూ కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేయబోతున్నట్లు స్పష్టమైంది" అని కేటీఆర్ వెల్లడించారు.

**సింగరేణిపై కాంగ్రెస్, బీజేపీల కుట్రలను తిప్పికొట్టండి**


కరీంనగర్ జిల్లా పరిధిలో అత్యంత కీలకమైన సింగరేణి సంస్థపై అటు కేంద్రంలోని బీజేపీ, ఇటు రాష్ట్రంలోని కాంగ్రెస్ కలిసి చేస్తున్న కుట్రలను, అవినీతిని కార్మికులు, ప్రజల ముందుకు బలంగా తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. అధికారం ఉన్నా లేకపోయినా పార్టీ వెంటే నడిచిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకోవాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. ఇందుకోసం కేవలం గ్రామ స్థాయిలోనే కాకుండా, ప్రతి నియోజకవర్గంలో 'బూత్‌ల వారీగా' ప్రత్యేక కార్యాచరణతో కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేయాలని ఆదేశించారు.

కరువు వచ్చినప్పుడే కాళేశ్వరం ప్రాజెక్టు విలువ తెలుస్తుందని తాము గతంలో చెప్పిన మాటలు ఇప్పుడు అక్షరాలా నిజమవుతున్నాయని కేటీఆర్ అన్నారు. "రోహిణి కార్తె ప్రవేశించి రెండు వారాలు దాటినా వర్షాలు పడటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడి నుంచి కేవలం 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తోంది తప్ప, ఎత్తిపోసి రైతన్నల నారుమడులకు అందించాలన్న కనీస సోయి ప్రదర్శించడం లేదు. ఇది కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనం" అని మండిపడ్డారు. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా స్థానికంగా ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడు అందినకాడికి దోచుకుంటూ అరాచకాలకు పాల్పడుతున్నారని, వాటిని సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని వాడుకుంటూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల మనసులు గెలుచుకోవాలని ఉమ్మడి జిల్లా నేతలకు కేటీఆర్ స్పష్టం చేశారు.

## విద్యార్థులను 'ఉగ్రవాదులు' అంటారా?

**కేంద్ర మంత్రిపై ఖర్గే, కేజ్రీవాల్ ఫైర్!**

**90 లీకేజీలతో లక్షల మంది భవిష్యత్తు నాశనం.. ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్!**



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం ఇప్పుడు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై, విద్యాశాఖ మంత్రిపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన ఈ ప్రభుత్వం, ఇప్పుడు హక్కుల కోసం ప్రశ్నిస్తున్న వారిని ఉగ్రవాదులుగా ముద్ర వేస్తోందని ఆరోపించారు.

**20 మంది విద్యార్థుల బలి.. అయినా పదవిపైనే వ్యామోహం:**

ఈ వ్యవహారంపై మల్లికార్జున ఖర్గే సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ కేంద్రంపై ఘాటు విమర్శలు చేశారు. "బీజేపీ హయాంలో దేశంలో ఇప్పటివరకు 90 పేపర్ లీక్‌లు జరిగాయి. దీనివల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైంది. తాజాగా నీట్ పేపర్ లీక్ ఘటన తీవ్ర మనస్తాపానికి గురిచేయడంతో దేశంలో 20 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఎన్నో కుటుంబాలు తీరని వేదనను అనుభవిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి తప్పుకోకుండా, తన పదవిని అంటిపెట్టుకుని ఉండటమే కాకుండా.. న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థుల గొంతును ఉగ్రవాదుల గొంతుగా అభివర్ణించడం దుర్మార్గం" అని ఖర్గే మండిపడ్డారు.

**పశ్నించినవారిని దేశద్రోహులుగా చిత్రించడం అలవాటే:**

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా చిత్రీకరించడం బీజేపీ నేతలకు నిత్యకృత్యంగా మారిందని ఖర్గే ధ్వజమెత్తారు. గతంలో నల్లచట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన రైతులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఆందోళన జీవులు', 'పరాన్న జీవులు' అన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు న్యాయం అడుగుతున్న విద్యార్థుల విషయంలోనూ అదే పంథా అవలంబిస్తున్నారని, దేశవ్యాప్తంగా విద్యార్థుల స్వరం మరింత బలంగా వినిపిస్తుందని, ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఎంత అహంకారం? - అరవింద్ కేజ్రీవాల్:**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సైతం ఈ అంశంపై కేంద్ర మంత్రిని నిలదీశారు. "తమ భవిష్యత్తును కాపాడుకోవడానికి, పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న అమాయక విద్యార్థులు దేశాన్ని విభజించాలనుకుంటున్నారా? విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తూ.. మేమే దేశాన్ని కాపాడుతున్నామని చెప్పుకోవడం కేంద్ర మంత్రి అహంకారానికి నిదర్శనం" అని ట్వీట్ చేశారు. మరోవైపు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కూడా స్పందిస్తూ.. విద్యార్థుల ఆత్మహత్యలకు న్యాయం అడిగితే తమ్ము ఉగ్రవాదుల బీ-టీమ్ అనడం దారుణమని, తమకు వీరి నుంచి దేశభక్తి సర్టిఫికెట్లు అవసరం లేదని మండిపడ్డారు.

**వివాదానికి కారణమైన కేంద్ర మంత్రి వ్యాఖ్యలు:**

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జంతర్‌మంతర్ నిరసనలపై మాట్లాడుతూ.. "ప్రజాస్వామ్యంలో ప్రజలచే తిరస్కరణకు గురైన కొన్ని రాజకీయ శక్తులు మారువేషంలో వచ్చి విద్యా వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. దేశాన్ని విభజించాలనుకునే వారి కోసం నినాదాలు చేసే శక్తులే ఈ విద్యార్థి నిరసనల వెనుక ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలే ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి.

## పాకిస్థాన్ గగనతలంలోకి ఎయిరిండియా విమానం..

**డీజీసీఏ వివరణ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఢిల్లీ నుంచి అమృత్‌సర్‌కు వెళ్తున్న ఎయిరిండియా విమానం పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించిందన్న వార్తలపై పౌరవిమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) వివరణ ఇచ్చింది. ఈ ఘటన జూన్ 22న జరిగినట్లు డీజీసీఏ ధ్రువీకరించింది.

డీజీసీఏ తెలిపిన వివరాల ప్రకారం, అమృత్‌సర్‌కు చేరుకునే సమయంలో విమానం కొద్దిసేపు పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించింది. అనంతరం పాకిస్థాన్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులతో సమన్వయం చేసుకుని విమానాన్ని సురక్షితంగా మళ్లీ భారత గగనతలంలోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది. ఈ ఘటనకు సంబంధించిన నివేదికలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ప్రమాదం ఏర్పడలేదని, విమాన నిర్వహణ నిబంధనలకు అనుగుణంగానే చర్యలు చేపట్టినట్లు డీజీసీఏ వెల్లడించింది.ఇటీవల ఈ ఘటనపై సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్ కావడంతో డీజీసీఏ అధికారిక ప్రకటన విడుదల చేసి స్పష్టత ఇచ్చింది. విమాన ప్రయాణ భద్రతకు సంబంధించి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో బిగ్ రిలీఫ్

**హుజూర్‌నగర్ ఉపఎన్నికల 5 కేసులు కొట్టివేత!**

**రోడ్‌షోలు, కోడ్ ఉల్లంఘన ఆరోపణలపై**

**చట్టపరమైన చిక్కుల నుంచి విముక్తి!**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఉన్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. 2019 హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో ఆయనపై నమోదైన ఐదు క్రిమినల్ కేసులను తెలంగాణ హైకోర్టు బుధవారం పూర్తిగా కొట్టి వేసింది. ఈ కేసుల నుంచి తనను విముక్తుడిని చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి దాఖలు చేసిన ఐదు వేర్వేరు క్వాష్ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన ఈ మేరకు తుది తీర్పును వెలువరించారు.

**రోడ్‌షోలు, అనుమతుల ఉల్లంఘన ఆరోపణలు:**

2019లో నల్గొండ ఎంపీగా ఉన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి లోక్‌సభకు ఎన్నిక కావడంతో హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆ సమయంలో మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తరఫున నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా భారీ రోడ్‌షోలు, ర్యాలీలు, సభలు నిర్వహించారని, డీజే మైక్ సౌండ్ సిస్టమ్స్ వాడటంతో పాటు నిర్దేశిత సమయం కంటే ఎక్కువ సేపు ప్రసంగించారని ఎన్నికల ప్రవర్తనా నియమావళి (వీజజ) ఉల్లంఘనల కింద సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు నమోదయ్యాయి. అనుమతించిన వాహనాల కంటే ఎక్కువ సంఖ్యలో కార్లు, బైక్‌లతో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారనేది పోలీసుల ప్రధాన అభియోగం.

సాధారణ ఎన్నికల ప్రచారాల్లో జరిగే అంశాలను పెద్దవిగా చేస్తూ, రాజకీయ కక్షతోనే అప్పటి ప్రభుత్వం తనపై ఈ కేసులు పెట్టించిందని రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాదులు కోర్టులో బలంగా వాదించారు. ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలు విన్న హైకోర్టు జూన్ 18న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం ఆ ఐదు కేసులను కొట్టివేస్తూ న్యాయస్థానం తుది ఉత్తర్వులు జారీ చేయడంతో, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు చట్టపరంగా ముగింపు పలికినట్లయింది.



## చెన్నైలో సీఎం విజయ్‌ను కలిసిన స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు!

**పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన టాలీవుడ్ నిర్మాత.. సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్!**

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ ప్రముఖ చలనచిత్ర నిర్మాత దిల్ రాజు.. తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్‌ను చెన్నైలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విజయ్ పుట్టినరోజును పురస్కరించుకుని దిల్ రాజు ఆయన నివాసంలో ప్రత్యేకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్‌కు పుష్పగుచ్ఛం అందించి తన అభిమానాన్ని చాటుకున్నారు. వీరిద్దరి మధ్య ఈ భేటీ ఎంతో ఆత్మీయంగా, ఆహ్లాదకర వాతావరణంలో సాగింది.

**‘వారసుడు’ నాటి బంధం.. రాజకీయ ప్రవేశం తర్వాత తొలిసారిగా..**

దిల్ రాజు గతంలో విజయ్ హీరోగా ‘వారిసు’ అనే భారీ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ఈ సినిమా తెలుగులో ‘వారసుడు’ పేరుతో విడుదలై ఘన విజయం సాధించింది. ఆ సినిమా నిర్మాణ సమయం నుంచి వీరిద్దరి మధ్య అత్యంత ఆత్మీయ అనుబంధం కొనసాగుతోంది. విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి, తమిళనాడు ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత దిల్ రాజు ఆయనను కలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రస్తుతం వీరి భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఇటు సినీ వర్గాలతో పాటు అటు రాజకీయ వర్గాల్లోనూ ఈ భేటీ ఆసక్తికరంగా మారింది.



## ప్రెగ్నెన్సీ వార్తలపై స్పష్టత ఇచ్చిన సమంత

**భర్త రాజ్ నిడిమోరుతో కలిసి కొత్త జర్నీ..**

**డిసెంబర్‌లో డెలివరీ, సినిమాలకు తాత్కాలిక బ్రేక్!**

**బలగం టీవీ, హైదరాబాద్**

స్టార్ హీరోయిన్ సమంత అభిమానులకు ఎట్టకేలకు ఒక అద్భుతమైన తీపికబురు అందించారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తన ప్రెగ్నెన్సీ గురించి వస్తున్న ఊహాగానాలకు ఆమె స్వయంగా తెరదించారు. తాను తల్లి కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించి అభిమానుల్లో అమితానందాన్ని నింపారు. సినీ కెరీర్‌లో ఎన్నో బ్లాక్ బస్టర్స్ విజయాలు అందుకున్న సమంత.. ఇప్పుడు తన రియల్ లైఫ్‌లో మాతృత్వపు మధురిమలను ఆస్వాదించేందుకు సిద్ధమయ్యారు.


**స్వయంగా కన్ఫర్మ్ చేసిన సామ్.. డిసెంబర్‌లో డెలివరీ:**

ఇటీవల ‘మా ఇంటి బంగారం’ సినిమా సక్సెస్ మీట్‌లో సమంత బేబీ బంప్‌తో కనిపించడంతో ఈ ప్రచారం మొదలైంది. ఆ తర్వాత ప్రముఖ దర్శకురాలు నందిని రెడ్డి కూడా ఇంటర్వ్యూలో దీనిపై హింట్ ఇచ్చారు. తాజాగా మీడియా ముందుకు వచ్చిన సమంత.. ఈ గుడ్ న్యూస్‌ను స్వయంగా ధృవీకరించారు. తన రాబోయే బిడ్డ కోసం తాను, తన భర్త.. ప్రముఖ ఫిల్మ్ మేకర్ రాజ్ నిడిమోరు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ‘ఫ్యామిలీ మ్యాన్ 2’ సమయంలో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి, 2025 డిసెంబర్ 1న కోయంబత్తూర్‌లోని ఈశా యోగా సెంటర్‌లో వీరి వివాహం జరిగిన సంగతి తెలిసిందే. కాగా, ఈ ఏడాది (2026) డిసెంబర్ నెలలో సమంత బిడ్డకు జన్మనివ్వనున్నారు.

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రముఖ నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ బర్త్ డే సెలబ్రేషన్స్‌లో సమంత తన భర్త రాజ్ నిడిమోరుతో కలిసి హాజరయ్యారు. ఆ పార్టీలో ఆమె బేబీ బంప్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. అందరితో నవ్వుతూ మాట్లాడుతూ ఎంతో ఉత్సాహంగా కనిపించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

**సినిమాలకు షార్ట్ బ్రేక్:**

ప్రెగ్నెన్సీ నేపథ్యంలో సమంత తన కెరీర్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. వైద్యుల సలహా మేరకు షూటింగ్స్‌కు తాత్కాలికంగా విరామం (మ్యాటర్నిటీ బ్రేక్) ప్రకటించారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా తన ఆరోగ్యంపై, పుట్టబోయే బిడ్డపై పూర్తి ఫోకస్ పెట్టాలని ఆమె నిర్ణయించుకున్నారు. డెలివరీ అనంతరం మళ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధించి సినిమాల్లోకి రీఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. కెరీర్ పీక్స్‌లో ఉన్న సమయంలో పర్సనల్ లైఫ్‌కు ప్రాధాన్యత ఇస్తూ సమంత తీసుకున్న నిర్ణయంపై ఇండస్ట్రీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా ఈ జంటకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



## నేటి తరం హీరోయిన్లు రిస్క్ తీసుకోవడం లేదు

**బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు!**

**అప్పట్లో లేని శిక్షణ ఇప్పుడుంది.. కానీ మల్టీస్టారర్ సినిమాలకు నో చెబుతున్నారు!**

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్‌లో కాలం మారుతున్నా, తరాలు మారుతున్నా నటీమణుల పనితీరు, వారి అంకితభావంలో ఎలాంటి మార్పు రాలేదని ప్రముఖ స్టార్ హీరో అక్షయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. అయితే ఒక నిర్దిష్ట విషయంలో మాత్రం నేటి తరం హీరోయిన్లు తమ సీనియర్ నటీమణులతో పోలిస్తే భిన్నంగా ఉన్నారని, రిస్క్ తీసుకునే విషయంలో కొత్త తరం అంతగా ముందుకు రావడం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

**మల్టీస్టారర్ చిత్రాలపై విముఖత:**

తన తాజా మల్టీస్టారర్ చిత్రం ‘వెల్‌కమ్ టు ది జంగిల్’ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అక్షయ్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాలో 90ల నాటి స్టార్ హీరోయిన్ల నుంచి ప్రస్తుత తరం నటీమణుల వరకు పలువురు కీలక పాత్రల్లో నటించారు. ఈ నేపథ్యంలో వివిధ తరాల నటీమణుల మధ్య ఉన్న వ్యత్యాసాల గురించి అక్షయ్‌ను ప్రశ్నించగా ఆయన స్పందించారు. “పరిశ్రమలో అందరూ ప్రొఫెషనల్‌గానే ఉంటారు. నటన పరంగా పెద్దగా తేడా కనిపించదు. కానీ నేటి తరం నటీమణులు పరిశ్రమలోకి అడుగుపెట్టే ముందే ఎంతో సన్నద్ధతతో, అవగాహనతో వస్తున్నారు. మా కాలంలో లేని అద్భుతమైన శిక్షణ ఇప్పటి వారికి లభిస్తోంది” అని అక్షయ్ కొనియాడారు.

ఇదే సమయంలో నేటి తరం నటీనటుల్లో తాను గమనించిన ఒక ప్రధాన లోపాన్ని కూడా అక్షయ్ కుమార్ బాహాటంగా ప్రస్తావించారు. “ప్రస్తుత కాలంలో మల్టీస్టారర్ సినిమాలు చాలా తక్కువగా వస్తున్నాయి. ఎందుకంటే చాలా మంది నటీనటులు అలాంటి సినిమాల్లో నటించడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మరొకరితో స్క్రీన్‌ను ఎందుకు పంచుకోవాలి? అనే ఆలోచనా ధోరణి వారిలో ఎక్కువగా కనిపిస్తోంది” అని అక్షయ్ అన్నారు. సినీ పరిశ్రమ మరింత అభివృద్ధి సాధించాలన్నా, బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు నమోదు కావాలన్నా మల్టీస్టారర్ చిత్రాలు ఎంతో అవసరమని, అలాంటి సంస్కృతి మళ్లీ ఊపందుకుంటే ఇండస్ట్రీకి ఎంతో మేలు జరుగుతుందని అక్షయ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## వైభవంగా వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ అవార్డుల ప్రదానోత్సవం!

**మితిమీరిన నెగెటివ్ ప్రచారానికి దూరంగా ఉండాలి:**

**నిర్మాత కేఎస్ రామారావు హితవు**

**బలగం టీవీ, హైదరాబాద్**

వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ‘8వ ఫిలిం, టీవీ డైరెక్టరీ మరియు డిజిటల్ మీడియా అవార్డ్స్’ ప్రదానోత్సవ వేడుక బుధవారం హైదరాబాద్‌లో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ ప్రముఖ నిర్మాత కేఎస్ రామారావు, దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్, అంబికా కృష్ణ, ‘మా’ ఉపాధ్యక్షుడు మాదాల రవి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.

**సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు బాధ్యతగా ఉండాలి:**

ఈ సందర్భంగా సీనియర్ నిర్మాత కేఎస్ రామారావు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో డిజిటల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సినిమాల విషయంలో మితిమీరిన నెగెటివ్ ప్రచారానికి దూరంగా ఉండాలని సూచించారు. ఒక సినిమా వెనుక ఎంతోమంది శ్రమ ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అనంతరం తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ.. నేటి సమాజాన్ని సోషల్ మీడియా ఎంతగానో ప్రభావితం చేస్తున్నదని, కంటెంట్ క్రియేటర్లు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

**కళాకారులకు పురస్కారాలు:**




సినీ, టీవీ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు నటీనటులతో పాటు, డిజిటల్ మీడియా రంగంలో రాణిస్తున్న పలువురు ఇన్‌ఫ్లూయెన్సర్లకు, కంటెంట్ క్రియేటర్లకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అవార్డులను ప్రధానం చేశారు. ఈ వేడుకలో పలువురు టీవీ ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణులు, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.

## సందీప్ కిషన్ ‘సూపర్ సుబ్బు’ ట్రైలర్ విడుదల!

**ఉపాధ్యాయుడి కథతో ఔట్ అండ్ ఔట్ కామెడీ ఎంటర్‌టైనర్.. జూలై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్!**

**బలగం టీవీ, హైదరాబాద్**

వైవిధ్యభరిత చిత్రాల నటుడు సందీప్ కిషన్, బాలీవుడ్ బ్యూటీ మిథిలా పాల్కర్ జంటగా నటిస్తున్న సరికొత్త కామెడీ వెబ్‌సిరీస్ ‘సూపర్ సుబ్బు’. ఈ సిరీస్‌కు సంబంధించిన ట్రైలర్‌ను బుధవారం చిత్ర యూనిట్ ఘనంగా ఆవిష్కరించింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సిరీస్ జూలై 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది.

ఈ వెబ్‌సిరీస్‌లో సందీప్ కిషన్ సుబ్రహ్మణ్యం అలియాస్ ‘సుబ్బు’ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి పాత్రలో కనిపించనున్నారు. మాపూర్ అనే ఒక మారుమూల గ్రామానికి బదిలీపై వెళ్లిన సుబ్బుకు అక్కడ ఎలాంటి విచిత్ర పరిస్థితులు ఎదురయ్యాయి? అతని జీవితాన్ని మార్చేసిన సంఘటనలు ఏంటనే అంశాలను ఆవిష్కరిస్తూ కట్ చేసిన ట్రైలర్ ఆద్యంతం హిలేరియస్‌గా సాగి ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఈ సిరీస్ విశేషాలను హీరో సందీప్ కిషన్ పంచుకుంటూ.. సాధారణంగా సమాజంలో ప్రజలు బహిరంగంగా మాట్లాడటానికి సంకోచించే ఒక సీరియస్ అంశాన్ని ఇందులో చర్చించామని తెలిపారు. ఆ సమస్యను హాస్యం, భావోద్వేగాలతో మేళవించి దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారని, ఎదురువచ్చిన సమస్యను పరిష్కరించబోయి తానే ఇబ్బందుల్లో చిక్కుకునే అమాయకపు టీచర్‌గా తన పాత్ర నవ్వులు పూయిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కథానాయిక మిథిలా పాల్కర్ మాట్లాడుతూ.. ఈ సిరీస్‌లో వినోదంతో పాటు మానవ సంబంధాల ఆవశ్యకతను కూడా చూపించామని పేర్కొన్నారు.

ఈ క్రేజీ వెబ్‌సిరీస్‌లో హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, గెటప్ శ్రీను, మానస చౌదరి తదితరులు కీలక




పాత్రలు పోషించారు. వీరి కలయికతో సిరీస్‌లో కామెడీ డోస్ గట్టిగానే ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ‘అద్భుతం’, ‘డీజే టిల్లు’ చిత్రాల ఫేమ్ మల్లిక్ రామ్ ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించారు. ట్రైలర్‌కు వస్తున్న రెస్పాన్స్‌తో జూలై 2న విడుదల కానున్న ఈ సిరీస్‌పై డిజిటల్ వీక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి.

## సౌత్ సినిమాపై తమన్నా సంచలన వ్యాఖ్యలు..



**దక్షిణాదిలో పురుషాధిక్యత ఎక్కువ, కేవలం గ్లామర్‌కే ప్రాధాన్యత ఇస్తారు: మిల్కీ బ్యూటీ కామెంట్స్**

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా దక్షిణాది సినీరంగంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సౌత్ సినిమాల్లో పురుషాధిక్యత (మేల్ డామినేషన్) ఎక్కువగా ఉంటుందని, ఇక్కడ కథానాయికలను కేవలం గ్లామరస్‌గా చూపించడానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని తమన్నా చేసిన కామెంట్స్ సంచలనం సృష్టిస్తున్నాయి.

**బాలీవుడ్‌లో స్వేచ్ఛ ఉంది.. కానీ ఇక్కడ బ్యాలెన్స్ చేయాలి:**

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తమన్నా హిందీ, దక్షిణాది చిత్రసీమల మధ్య వ్యత్యాసాల గురించి మాట్లాడుతూ.. “బాలీవుడ్‌లో రెండు రకాల నటులు ఉంటారు. కొందరు కేవలం నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుని కెరీర్‌ను నిర్మించుకుంటారు, మరికొందరు గ్లామర్‌కే పరిమితమవుతారు. అక్కడ నటీనటులకు నటన, గ్లామర్‌లలో ఏదో ఒకటి ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. కానీ దక్షిణాది చిత్రసీమలో మాత్రం అలా కుదరదు.. ఇక్కడ హీరోయిన్లు నటనను, గ్లామర్‌ను రెండింటినీ సమానంగా బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుంది” అని పేర్కొంది.

**మండిపడుతున్న సౌత్ నెటిజన్లు.. కృతజ్ఞత లేదంటూ ఫైర్:**

తమన్నా చేసిన ఈ వ్యాఖ్యలపై దక్షిణాది సినీ అభిమానులు, నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తెలుగు, తమిళ పరిశ్రమల ద్వారానే స్టార్‌డమ్, గుర్తింపు తెచ్చుకున్న తమన్నా.. ఇప్పుడు ఆ చిత్రసీమలనే తక్కువ చేసి మాట్లాడటం సరికాదని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు మండిపడుతున్నారు. ఎన్నో సూపర్ హిట్ సినిమాలు, వైవిధ్యమైన పాత్రలు ఇచ్చిన సౌత్ ఇండస్ట్రీపై కనీస కృతజ్ఞత లేకుండా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదంటూ నెట్టింట పెద్ద ఎత్తున ట్రోల్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వివాదం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## కమల్ నిర్మాణంలో సూపర్ స్టార్ రజినీకాంత్.. ‘

**ధర్మన్’గా తలైవా సంక్రాంతి పోరు!**

**మల్టీస్టారర్ టైటిల్ లాంచ్ వేడుకలో రజనీ, కమల్ ఆసక్తికర వ్యాఖ్యలు..**

**సెప్టెంబర్‌లోనే ‘జైలర్ 2’!**

**బలగం టీవీ, హైదరాబాద్**

కోలీవుడ్ దిగ్గజాలు సూపర్ స్టార్ రజినీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ కలయికలో రాబోతున్న భారీ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన టైటిల్‌ను బుధవారం చెన్నైలో అధికారికంగా ప్రకటించారు. కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ ‘రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్’ బ్యానర్‌పై, యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి ‘ధర్మన్: ది డెడ్లీ డాక్టర్’ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు.

**నేను మాట్లాడినా సమస్యే, మౌనంగా ఉన్నా సమస్యే - రజనీకాంత్:**

టైటిల్ అనౌన్స్ మెంట్ మీడియా సమావేశంలో రజనీకాంత్ తనపై వచ్చే విమర్శలపై తనదైన శైలిలో స్పందించారు. “నేను మాట్లాడినా సమస్యే, మౌనంగా ఉన్నా సమస్యే. నన్ను ఇష్టపడేవారికి నేనేం చేసినా నచ్చుతుంది, ఇష్టపడని వారికి ఎలా చేసినా తప్పుగానే కనిపిస్తుంది. ఇలాంటి విషయాలను పట్టించుకుంటే మనం ముందుకు వెళ్లలేం” అని చమత్కరించారు. తన 173వ సినిమా కోసం నలుగురు దర్శకులు మారిన వృత్తాంతాన్ని ఆయన వివరించారు. మొదట కె.ఎస్.రవికుమార్, ఆ తర్వాత సుందర్.సి, అనంతరం శిబి చక్రవర్తి అనుకున్నా.. చివరికి అశ్వత్ మారిముత్తు చెప్పిన అద్భుతమైన కథ లాక్ అయిందని, కమల్ కూడా ఈ కథ విని ఇంప్రెస్ అయ్యారని రజనీ తెలిపారు.

**ఆ రోజు విడిపోవడమే మమ్మల్ని దిగ్గజాలను చేసింది - కమల్ హాసన్:**

చిత్ర నిర్మాత కమల్? హాసన్ మాట్లాడుతూ రజనీతో తనకున్న ఐదు దశాబ్దాల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. “కెరీర్ ఆరంభంలో మేమిద్దరం కలిసి నటిస్తున్నప్పుడు, ఒక బిస్కట్‌ను ఇద్దరం పంచుకుని తింటే ఎవరికీ కడుపు నిండదనే ఉద్దేశంతో విడివిడిగా సినిమాలు చేద్దామని నేనే రజనీతో చెప్పాను. ఆ నిర్ణయమే నేడు మమ్మల్ని ఈ స్థాయిలో నిలబెట్టింది. సాధారణంగా నిర్మాత హడావుడి చేస్తారు, కానీ ఈ సినిమా విషయంలో రజనీకాంత్ ఎవరినీ నిద్రపోనివ్వడం లేదు. తాను కమల్ నిర్మాణంలో నటిస్తున్నానంటూ అందరికీ ఫోన్లు చేసి చెబుతున్నారు” అని కమల్ సరదాగా వ్యాఖ్యానించారు.

**2027 సంక్రాంతి బరిలో ‘ధర్మన్’:**

ఈ భారీ చిత్రానికి యువ సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.




రజనీకాంత్ సరసన సీనియర్ నటి సిమ్రాన్ కథానాయికగా నటిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

**సెప్టెంబర్‌లోనే ‘జైలర్ 2’ విశ్వరూపం:**

రజనీకాంత్ నటిస్తున్న మరో సెన్సేషనల్ ప్రాజెక్ట్ ‘జైలర్ 2’ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో వస్తున్న ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్, సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తితో పాటు మోహన్‌లాల్, రమ్యకృష్ణ, శివరాజ్‌కుమార్‌లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను 2026 సెప్టెంబర్‌లో థియేటర్లలో భారీస్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## తండ్రి అయిన నారా రోహిత్..

**మగబిడ్డకు జన్మనిచ్చిన శిరీష.. సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న శుభాకాంక్షలు!**

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ విలక్షణ నటుడు నారా రోహిత్ తండ్రి అయ్యారు. ఆయన భార్య శిరీష హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో సోమవారం రాత్రి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తతో నారా కుటుంబంలో అమితానందం, పండుగ వాతావరణం నెలకొంది. ప్రస్తుతం తల్లీ, బిడ్డ ఇద్దరూ క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నట్లు కుటుంబ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. నారా రోహిత్ దంపతులకు కుమారుడు జన్మించిన విషయం తెలియడంతో అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.నారా రోహిత్, శిరీష కలిసి ‘ప్రతినిధి 2’ చిత్రంలో నటించారు. ఆ సినిమా షూటింగ్ సమయంలోనే ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. పెద్దల అంగీకారంతో 2025 అక్టోబర్ 30న హైదరాబాద్‌లో వీరి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. రోహిత్ పెదనాన్న, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు - భువనేశ్వరి దంపతులు దగ్గరుండి ఈ పెళ్లిని జరిపించారు.



# పారదర్శకంగా రాజన్న కోడెల పంపిణీ..



**-పక్కదారి పట్టించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటాం**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాల నుంచి అర్హులైన రైతులకు కోడెలను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో రైతులకు బుధవారం 120 జతల కోడెలను ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై రైతులకు అందజేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి కోడెను కట్టే సంస్కృతి ఇక్కడ ఉందని అన్నారు . భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు తిప్పాపూర్ గోశాల లో ఉచితంగా స్వామివారి కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పంపిణీ చేసిన కోడెలను దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖ ఇతర శాఖల అధికారులతో నిత్యం తనిఖీ చేయిస్తామని, కోడెలను పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ నియోజకవర్గంలోని మర్రిపల్లిలో అధునాతన సౌకర్యాలతో 40 ఎకరాల స్థలం గోశాలకు కేటాయించిందని తెలిపారు. త్వరలోనే గోశాల పనులకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. కోడెలను సన్న, చిన్న కారు రైతులకు పంపిణీ చేస్తున్నామని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అర్హులైన రైతులకు త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. కోడెలను సంరక్షించి.. వ్యవసాయ పనులకు వినియోగించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆన్లైన్ లో అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకున్న రైతులకు పశువైద్య, ఆలయ, వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

రాజన్న ప్రసాదంగా స్వీకరించి.. కోడెలను రైతులు వ్యవసాయ పనులకే వినియోగించాలని సూచించారు. నిరంతరం కోడెలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఎప్పటికప్పుడు కోడెలను తనిఖీ చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీఓ కె. ఎస్బి. కుమారి, ఆలయ ఈఓ రమాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమీషనర్ లోకేష్, వ్యవసాయ, రెవెన్యూ, ఆలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో సమూల మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి కృషి..

**-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

విద్యారంగంలో సమూల మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. బుధవారం వేములవాడ పట్టణంలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా కనీస మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు .

ప్రజా ప్రభుత్వంలో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టి, ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాణ్యమైన బోధనకు ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. విద్యార్థుల ఆహారం, వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచి వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు..

వేములవాడ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళు న్నామని తెలిపారు. ఏటీసీతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, హైదరాబాద్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆధునిక, పోటీ ప్రపంచానికి తగిన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు.



వేములవాడ పట్టణంలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రైవేట్ విద్యాసంస్థలు కేవలం లాభాపేక్షతో కాకుండా సామాజిక బాధ్యతతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆధునిక జ్ఞానంతో కూడిన విద్య అందించాలని, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారి లక్ష్య సాధనకు మార్గనిర్దేశనం చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రోశిడి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్ , పట్టణ అధ్యక్షులు తుమ్ మధు, కౌన్సిలర్లు,ఆల్ఫోర్స్ విద్యా సంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం..



**-కేంద్ర మంత్రిని వేంటనే బర్తరఫ్ చేయాలి**

**-డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అన్నారు . సిరిసిల్ల పట్టణంలో ని డీసీసీ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ, అఖిల భారత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిశానిర్దేశం మేరకు విద్యార్థుల పక్షాన పోరాడతామని అన్నారు.

?ప్రస్తుతం దేశంలో నిరుద్యోగం పెరిగిపోవడానికి, విద్యావ్యవస్థలోని లోపాలే ప్రధాన కారణమని ఆరోపించారు. నీట్ వంటి పరీక్షల కోసం విద్యార్థులు, వారి కుటుంబాలు కష్టపడి సంపాదించిన డబ్బును ఫీజులు, కోచింగ్ సెంటర్ల పేరుతో వృథా చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించే బడ్జెట్ కంటే, విద్యార్థులు ఖర్చు చేసే మొత్తమే మూడు రెట్లు ఎక్కువగా ఉండటం విచారకరమని పేర్కొన్నారు. కేవలం 1.4 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయిస్తే, విద్యార్థుల కుటుంబాలు వివిధ పోటీ పరీక్షల కోసం ఏటా 3.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయని అన్నారు.

?పేపర్ లీకేజీల కారణంగా మనోవేదనకు గురై శ్రేయ వంటి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం దేశానికే తీరని అవమానమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా పేపర్ లీకేజీ వల్ల ఇప్పటికే వెయ్యి మందికి పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని , దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని లేదా కేంద్ర ప్రభుత్వం ఆయన్ని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.?విద్యార్థులకు జరుగుతున్న ఈ అన్యాయంపై నిరసనగా జూన్ 25 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు . కాంగ్రెస్ పార్టీకి చెందిన యువజన విభాగం, ఎన్.ఎస్.యు.ఐ మరియు అనుబంధ విభాగాలన్నీ ఏకతాటిపైకి వచ్చి విద్యార్థుల్లో చైతన్యం నింపుతాయని, ఆగస్టు 9న ప్రతిష్టాత్మకంగా చేపట్టే 'చలో ఢిల్లీ' కార్యక్రమంతో కేంద్రంపై ఒత్తిడి పెంచుతామని హెచ్చరించారు.

?ఈ మీడియా సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షులు కూరగాయల కొమరయ్య, దత్తాత్రేయ గౌడ్, పిల్లి కనకయ్య, పులి రాంబాబులతో పాటు జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి చిలుక రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు వకులాభరణం శ్రీనివాస్, గొట్టే రుక్మిణి, రాగుల జగన్, మంగకిరణ్, గిరిధర్ రెడ్డి, బాల్ లక్ష్మి, సోమల రోజా, వనిత, నాగుల విష్ణు, మిరియాల కార్ శ్రీనివాస్, ఫిరోజ్ పాషా, అరుణ్ చారి, వెంకట్ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు రియాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అధిక ఫీజులు, పాఠ్యపుస్తకాల దోపిడీపై చర్యలు తీసుకోవాలి...


**-- బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ డిమాండ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని బీఆర్ఎస్వీ నాయకులు ఆరోపించారు. అధిక ఫీజులు, పాఠ్యపుస్తకాల విక్రయాల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని కోరుతూ జిల్లా విద్యాధికారి (డీఈఓ)కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ, ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై భరించలేని ఆర్థిక భారాన్ని మోపుతున్నారని అన్నారు. అధిక ఫీజుల కారణంగా అనేక మంది విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు మరియు ఇతర విద్యా సామగ్రిని పాఠశాలలలోనే విక్రయిస్తూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. పాఠశాలలను పుస్తకాల దుకాణాలుగా మార్చిన యాజమాన్యాలపై వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లాలోని అన్ని ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల విక్రయాలను పూర్తిగా అరికట్టాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలు కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్, మల్యాల



ప్రవీణ్, బైకని వేణు యాదవ్, ఎండి అజ్జు, శశి, ఎండి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో లారీ వ్యాపారి ఆత్మహత్య

**బలగం టీవీ,?బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. లారీ వ్యాపారంలో ఎదురైన ఆర్థిక నష్టాలు, అప్పుల భారం తట్టుకోలేక రాకం నరేష్ (32) తన నివాసంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాకం నరేష్

లారీ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే, వ్యాపారంలో ఆశించిన లాభాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన నరేష్, బుధవారం తన ఇంటి బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలిపారు. మృతుడి తండ్రి రాకం రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్. రమాకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి..

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను పెండింగ్ లో పెట్టకుండా ఎపటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు, అన్ని మండలాల తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.రెవెన్యూ డివిజన్లు, మండలాల వారీగా భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు.

భూ భారతి పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, రెవెన్యూ రికార్డులలో నమోదైన వివరాలు, వారసత్వ హక్కుల నమోదు, సర్వే నంబర్ల వారీగా భూ వివరాల ధృవీకరణ తదితర అంశాలను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.సాదా బైనామా దరఖాస్తులను జాప్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పత్రాలు, ఆధారాలు, గ్రామ రెవెన్యూ రికార్డులు, తదితర అంశాలను పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండేలా చూడాలని అన్నారు. సమీక్షలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు శ్రీధర్ బాబు, కె.ఎస్.బి. కుమారి, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికుల ధర్నాను విజయవంతం చేయండి...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీని వెంటనే అమలు చేయాలని, అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పీఎఫ్ పెన్షన్‌ను 6 వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు బీడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ ) జిల్లా గౌరవ అధ్యక్షులు ముశం రమేష్ తెలిపారు.?ఈ సందర్భంగా ముశం రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీడీ కార్మికులకు 4,016 రూపాయల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే ప్రభుత్వం ఏర్పడి సమయం గడుస్తున్నా ఆ హామీని అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు . ఉత్తర తెలంగాణలో బీడీ కార్మికుల ఓట్లు ఎన్నికల్లో కీలకం అని గుర్తించాలని, ఇచ్చిన హామీని అమలు చేయని పక్షంలో రాబోయే రోజుల్లో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఏళ్ల తరబడి పోరాడుతున్నా కేంద్రం మాత్రం పెన్షన్ పెంపు విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అన్నారు . నేటికీ చాలామంది కార్మికులకు వెయ్యి రూపాయల లోపే పెన్షన్ అందుతోందని, కార్మికుల సంక్షేమం కోసం వినియోగించాల్సిన వేల కోట్ల రూపాయల పీఎఫ్ నిధులను కార్పొరేట్ శక్తులకు దారదత్తం చేస్తూ పేద కార్మికులను నట్టేట ముంచుతోందని ఆరోపించారు.

కంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే సిరిసిల్లలో జరగనున్న ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు బీడీ కార్మికులు, టేకేదారులు, ప్యాకర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని కోరారు.?ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురం పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు జిందం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



# నేర పరిశోధనలో ఆధునిక సాంకేతికత కీలకం..

**- అదనపు ఎస్పీ చంద్రయ్య**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు అదనపు ఎస్పీ చంద్రయ్య సూచించారు.

?రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు కార్యాలయంలో 3వ జిల్లా స్థాయి పోలీస్ డ్యూటీ మీట్--2026 కార్యక్రమానికి అదనపు ఎస్పీ చంద్రయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, నేటి ఆధునిక కాలంలో నేరస్తులను న్యాయస్థానంలో దోషులుగా నిరూపించేందుకు శాస్త్రీయ ఆధారాల సేకరణ అత్యంత కీలకమని, దీనికోసం పోలీసు సిబ్బంది తమ వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం పదును పెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

?పోలీసు డ్యూటీ మీట్ అనేది కేవలం పోటీలకే పరిమితం కాకుండా, అధికారులు తమ అనుభవాలను పంచుకోవడానికి మరియు వినూత్న ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ డ్యూటీ మీట్‌లో భాగంగా కంప్యూటర్ అవగాహన, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, యాంటీ-సబోటేజ్ చెకింగ్, ఫోటోగ్రఫీ మరియు వీడియోగ్రఫీ వంటి వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారు జోనల్ స్థాయికి, తద్వారా జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని, ఇది రాష్ట్రాల మధ్య పోలీసు అధికారుల సమన్వయాన్ని మరియు సహకారాన్ని పెంచుతుందని అన్నారు . ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐలు రవి, నాగేశ్వరరావు, రవిందర్, వెంకటేష్, ఆర్ఐ సురేష్‌తో పాటు ఎస్ఐలు, ఆర్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# రిటైర్డ్ అయిన ప్రధానోపాధ్యాయునికి ఘన సన్మానం

**స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన చెన్నాడి జగన్ మోహన్ రావు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి, రిటైరైన తర్వాత కూడా ప్రభుత్వ బడిలో చదువుకుంటున్న విద్యార్థులపై ప్రేమతో కరీంనగర్ లోని రాంనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తనదైన శైలిలో సేవలందిస్తున్నారు.

ఈ సందర్భంగా స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మాట్లాడుతూ: పుట్టిన ఊరుపై ప్రేమతో గ్రామానికి తన వంతు కర్తవ్యంగా భావించి స్వచ్ఛ భారత్, ప్లాస్టిక్ నిషేధం వంటి కార్యక్రమాలతో పాటు గ్రామ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తానని, ముందుకు వచ్చినందుకు గాను గ్రామ ప్రజల తరఫున మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గం తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామ పంచాయతీ పాలకవర్గం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, వార్డు సభ్యులు చిలుముల శ్రీమణి ,కొట్టపల్లి రమ్యశ్రీ , ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, అక్కనపల్లి మధు,గంగాధర గంగాజమున, చంద్రగిరి వెంకటేష్, ఎర్ర సువర్ణ

# పిచ్చికుక్కల దాడిలో ఆరుగురికి తీవ్ర గాయాలు

**జగిత్యాల జిల్లా గుడిసెలపేటలో ఘటన**

**మహిళ ముఖంపై తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం**

**బాధితులకు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స**

**బలగం టీవీ, జగిత్యాల**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుడిసెలపేట గ్రామంలో బుధవారం పిచ్చికుక్కలు వీర విహారం చేశాయి. గ్రామంలో సంచరిస్తూ ఆరుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గ్రామానికి చెందిన నరసమ్మపై కుక్కలు దాడి చేయడంతో ఆమె ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మరో ఐదుగురికి ఛాతి, తల, ముఖం, కాళ్లపై తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని గ్రామస్థులు వెంటనే అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

గ్రామంలో పిచ్చికుక్కల సంచారం పెరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో తిరుగుతున్న వీధి కుక్కల నియంత్రణకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు

## మీజిల్స్, రూబెల్లా కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలి:



**డిఎంహెచ్వో డాక్టర్ జి.ఎంజేలాఅల్ఫ్రేడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పిల్లల్లో మీజిల్స్, రూబెల్లా వ్యాధుల నియంత్రణకు వైద్యులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.ఎంజేలాఅల్ఫ్రేడ్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్య నిపుణులు, చర్మ వ్యాధి నిపుణులు మరియు ఫిజిషియన్లతో డిఎంహెచ్వో డాక్టర్ జి.ఎంజేలాఅల్ఫ్రేడ్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

?ఈ సందర్భంగా డాక్టర్ జి.ఎంజేలాఅల్ఫ్రేడ్ మాట్లాడుతూ, పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు అందిస్తున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో మీజిల్స్, రూబెల్లా అనుమానిత లక్షణాలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలకు జ్వరంతో పాటు శరీరంపై దద్దుర్లు కనిపిస్తే, వెంటనే ఆ సమాచారాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి నివేదించాలని అన్నారు. సమాచారం అందిన వెంటనే సంబంధిత వైద్య బృందాలు క్షేత్రస్థాయిలో నమూనాలను సేకరించి, పరీక్షల కోసం పంపిస్తాయని, ఒకవేళ పాజిటివ్ అని నిర్ధారణ అయితే ఆయా ప్రాంతాల్లో తక్షణ నియంత్రణ చర్యలు చేపట్టి వ్యాధి వ్యాప్తిని అరికడతామని అన్నారు .

?అంతేకాకుండా, 15 సంవత్సరాల లోపు పిల్లల్లో శరీరంలోని ఏదైనా భాగం అకస్మాత్తుగా బలహీనపడటం గమనించినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. టీకాలు వేయించుకున్న తర్వాత పిల్లల్లో ఏవైనా చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులకు తెలియజేయాలని సూచించారు.

?రాబోయే ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రైవేట్ వైద్యులు కూడా కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా అందేలా చూడటం మనందరి బాధ్యత అని అన్నారు . ఈ సమావేశంలో డి.ఐ.ఓ డాక్టర్ సంపత్ కుమార్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.



## లహరి ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రారంభం

**పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పక్కన లహరి ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్వాహకుడు శివ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రారంభించారు. ఫ్లెక్సీలు, ఫోటో ఫ్రేములు, లభించునని శివ తెలియజేశారు. పట్టణాలకు దీటుగా వ్యాపార రంగంలో ఎల్లారెడ్డిపేట ముందుకు దూసుకు వెళ్తుందని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సబేరా బేగం, ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి, సర్పంచులు ఎలగందుల నరసింహులు, దొమ్మాటి నరసయ్య, మాజీ జెడ్పిటిసి చీటీ లక్ష్మణ్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, సద్ది లక్ష్మారెడ్డి, నంది కిషన్, నేవూరి వెంకట నరసింహారెడ్డి, బండారి బాల్ రెడ్డి, అడ్వకేట్ పసుల కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుల్లపల్లి నరసింహారెడ్డి, గుర్రాల రాజిరెడ్డి, రాము, కొర్రి అనిల్, ఇల్లెందుల శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రావు, సతీష్ రెడ్డి, ములిగే ప్రమోద్, సింగారం మధు, ఆశీర్వాదం, ఫోటోగ్రాఫర్స్ యూనియన్ ముత్యాల ప్రభాకర్ రెడ్డి, అజ్జు, కుబేర్, షాదుల్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు,



## కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, టెక్ట్స్ బుక్స్, బెడ్ షీట్లు పంపిణీ

**పాల్గొన్న సర్పంచ్ నాగెల్లి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ కొర్రి అనిల్**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్ పూర్ గ్రామంలోని కేజీబీవీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ నాగెల్లి వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ కొర్రి అనిల్ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు నోటుబుక్స్, టెస్ట్ బుక్స్, బెడ్ షీట్లను పంపిణీ చేశారు. విద్యార్థులందరూ అంకితభావంతో చదివి ఉన్నత మార్కులు సాధించి తల్లిదండ్రులతో పాటు గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తుందని అన్నారు. పుట్టిన గ్రామంలో కాకుండా ఉన్నత చదువులు చదువుకోవడానికి కేజీబీవీ పాఠశాలలో సీటు సాధించి ఇల్లును వదిలి విద్యార్థులు వచ్చారని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువస్తే తల్లిదండ్రులు ఎంతగానో ఆనందిస్తారని అంతకన్నా సంతోషం ఇంకా ఏమీ ఉండదని అన్నారు. పాఠశాలలో ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని విద్యార్థులకు స్థానిక సర్పంచ్ నాగెల్లి వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ కొర్రి అనిల్ అన్నారు, ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ అజంతా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

# బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందించాలి

**-ఏఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుంచి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై జిల్లాలోని ఆర్డీవోలు, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలోని తహసీల్దార్లు(ఏఈఆర్ఓ), సీడీపీఓలతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. తహసీల్దార్లు(ఏఈఆర్ఓ) తమ పరిధిలోని బీఎల్ఓలతో ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, గుర్తింపు కార్డుతో బీఎల్ఓలు, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికీ వెళ్లాలని ఆదేశించారు. తహసీల్దార్లు(ఏఈఆర్ఓ)లు క్షేత్ర స్థాయిలో సందర్శించి.. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. జన గణనలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలవడంతో తహసీల్దార్లు, ఇతర అధికారులను అభినందించారు.



సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై హౌసింగ్ పీడీ, డీఆర్డీఓ, మైనింగ్ శాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి బుధవారం జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఏఈ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు.

ముగ్గు పోసిన వారికి ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ.. పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు.ప్రతి ఎంపీడీఓ రోజూ ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలించాలని, తమ మండలానికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లి.. ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

లబ్దిదారులకు ఇటుకులు ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా..ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మేస్త్రీలు, వడ్రంగి ఇతర పని వారి వివరాలు లబ్ధిదారులకు అందుబాటులో పెట్టి ఇబ్బందులు దూరం చేయాలని సూచించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలని, లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి డబ్బు జమ అవుతున్నాయని వెల్లడించారు. ఇండ్ల నిర్మాణాలకు ఎక్కడా ఇసుక కొరత లేదని స్పష్టం చేశారు.

సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కారు.. తృటిలో తప్పిన ప్రమాదం

**ఎల్లారెడ్డిపేట మండలం బోప్పపూర్ శివారులో ఘటనలిలి**

**అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారులిలి**

**డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదంలిలి**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బోప్పపూర్ శివారులో ఓ కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

స్థానికుల కథనం ప్రకారం.. రోడ్డుపై వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని కారును బయటకు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో డ్రైవర్ ఒక్కడే ఉన్నట్లు తెలిసింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.




# బాస్ స్కామ్‌లపై టీజీసీఎస్‌బీ హెచ్చరిక

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో 'బాస్ స్కామ్' లేదా 'సీఈవో ఇంపర్సొనేషన్ ఫ్రాడ్' పేరుతో సరికొత్త సైబర్ మోసాలు పెరుగుతున్నాయని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) హెచ్చరించింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, వ్యాపార సంస్థల యజమానులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) సూచనల మేరకు ఈ మోసాలపై ప్రత్యేక హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్లు సంస్థల ఉన్నతాధికారులు, వ్యాపార యజమానుల పేర్లతో ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

అత్యవసర పనుల పేరుతో ఈమెయిల్‌లు, వాట్సాప్ సందేశాల ద్వారా క్ష్మ్రా, క్ష్మూక్ష్మ ఫార్మాట్‌లలో మాల్‌వేర్ ఫైళ్లను పంపుతున్నారని తెలిపారు. వాటిని ఓపెన్ చేసిన వెంటనే మొబైల్ లేదా కంప్యూటర్‌లో మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అయి, వాట్సాప్ వెబ్ సెషన్‌లు, వ్యక్తిగత సమాచారం, అధికారిక డేటా సైబర్ నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందన్నారు. దొంగిలించిన సమాచారంతో బాధితుల పైఅధికారుల పేరుతో ఉద్యోగులకు సందేశాలు పంపించి, అత్యవసరంగా డబ్బు బదిలీ చేయాలని లేదా రహస్య సమాచారాన్ని అందించాలని ఒత్తిడి తెస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఇలాంటి మోసాలకు సంబంధించి 300కు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని వెల్లడించారు. అనుమానాస్పద ఫైళ్లు, 'అత్యవసరంగా స్పందించాలి' వంటి సందేశాలను నమ్మవద్దని అధికారులు సూచించారు. డబ్బు బదిలీలు లేదా కీలక సమాచారం కోరే సందేశాలు వచ్చినప్పుడు సంబంధిత అధికారిని నేరుగా ఫోన్ ద్వారా సంప్రదించి నిర్ధారించుకోవాలని సూచించారు. ఒకవేళ 'బాస్ స్కామ్'పై అనుమానం కలిగితే, ఆ సందేశాలకు స్పందించకుండా, అటాచ్‌మెంట్‌లను తెరవకుండా వెంటనే సంస్థ ఐటీ విభాగానికి సమాచారం అందించి, సంబంధిత ఆధారాలతో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.





## కూస రవీందర్ కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**?బలగం టీవీ, బోయినిపల్లి:**

?రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నిలోజిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మరియు మాజీ సర్పంచ్ కూస రవీందర్-పద్మ దంపతుల కుమారుడు ప్రణయ్, సౌమ్యల వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సాయి మణికంఠ గార్డెన్‌లో జరిగిన ఈ వివాహ వేడుకకు చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

?ఈ సందర్భంగా నూతన వధూవరులైన ప్రణయ్ మరియు సౌమ్యలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆశీర్వదించి, వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వధూవరుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు.





## మెస్సీ రొనాల్డో పోరు ఎప్పుడంటే..?

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఫుట్‌బాల్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తున్న లియోనెల్ మెస్సీ--క్రిస్టియానో రొనాల్డో పోరుకు ఈసారి ప్రపంచకప్‌లో అవకాశం కనిపిస్తోంది. ఇప్పటివరకు ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో అర్జెంటీనా, పోర్చుగల్ జట్లు ఒక్కసారి కూడా తలపడకపోవడం విశేషం. అయితే ప్రస్తుత టోర్నీలో ఇరు జట్లు నాకౌట్‌కు చేరుకోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. గ్రూప్–జేలో అర్జెంటీనా వరుస విజయాలతో దూసుకుపోతుండగా, గ్రూప్–కేలో పోర్చుగల్ కూడా నాకౌట్‌కు అర్హత సాధించింది. తొలి మ్యాచ్‌లో డ్రా చేసిన పోర్చుగల్, రెండో మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌పై 5–0 తేడాతో ఘన విజయం సాధించింది.

**రౌండ్ ఆఫ్-16లో అవకాశం**

అర్జెంటీనా తమ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి, పోర్చుగల్ రన్నరప్‌గా నిలిస్తే, నాకౌట్ దశలో ఇరు జట్లు రౌండ్ ఆఫ్–16లోనే తలపడే అవకాశం ఉంది.

**క్వార్టర్ లేదా సెమీఫైనల్లో ఢీ**

రెండు జట్లు తమ తమ గ్రూప్‌లలో అగ్రస్థానాల్లో నిలిచి నాకౌట్ దశలో విజయాలు సాధిస్తే, టోర్నీ బ్రాకెట్‌ను బట్టి క్వార్టర్ ఫైనల్ లేదా సెమీఫైనల్‌లో ఎదురెదురుగా నిలిచే అవకాశముంది.

**ఫైనల్లో డ్రీమ్ క్లాష్**

ఇరు జట్లు ఫైనల్‌కు చేరితే జూలై 19న న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో జరిగే తుది పోరులో మెస్సీ--రొనాల్డో ముఖాముఖి కావచ్చు. ఇది ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక పోరుగా నిలిచే అవకాశం ఉంది. ప్రస్తుతం మెస్సీ ఐదు గోల్స్‌తో, రొనాల్డో రెండు గోల్స్‌తో అద్భుత ఫామ్‌లో ఉన్నారు. గ్రూప్ దశ ముగిసి అధికారిక నాకౌట్ బ్రాకెట్ ఖరారైన తర్వాత ఈ ఇద్దరు దిగ్గజాలు ఏ దశలో తలపడే అవకాశముందనే విషయంపై స్పష్టత రానుంది.



## విరాట్ కోహ్లీని వెనక్కినెట్టిన శుభ్‌మన్ గిల్

**మూడో స్థానానికి పడిపోయిన రన్ మెషిన్.. నాలుగో స్థానంలోనే రోహిత్ శర్మ స్థిరం!**

**బలగం టీవీ, హైదరాబాద్**

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సరికొత్త రికార్డు సృష్టించాడు. అఫ్గానిస్థాన్‌తో ఇటీవల ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో అసాధారణ ప్రదర్శన కనబర్చిన గిల్.. ఏకంగా మూడు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ఈ సిరీస్‌లోని తొలి రెండు వన్డేల్లో గిల్ 84, 154 పరుగులతో విశ్వరూపం ప్రదర్శించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, గిల్ అతని కంటే కేవలం 24 రేటింగ్ పాయింట్ల వెనుకంజలో ఉన్నాడు.

**మూడో స్థానానికి కోహ్లీ.. నాలుగో స్థానంలోనే 'హిట్‌మ్యాన్':**

ఈ తాజా ర్యాంకింగ్స్‌లో శుభ్‌మన్ గిల్.. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని వెనక్కినెట్టాడు. తొడకండరాల గాయంతో అఫ్గానిస్థాన్ వన్డే సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో స్థానానికి పడిపోయాడు. మరోవైపు టీమిండియా సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ ఎలాంటి మార్పు లేకుండా నాలుగో స్థానంలోనే కొనసాగుతున్నాడు.

**దూసుకొచ్చిన ఇషాన్ కిషన్.. అర్ష్‌దీప్ సింగ్:**

టీమిండియా యంగ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఏకంగా 21 స్థానాలు దూసుకొచ్చి 43వ ర్యాంకు సాధించగా, శ్రేయస్ అయ్యర్ 14వ స్థానంలో నిలిచాడు. వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ రెండు స్థానాలు దిగజారి 11వ స్థానానికి పరిమితమయ్యాడు. బౌలింగ్ విభాగంలోనూ భారత్‌కు మేలు జరిగింది. పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 16 స్థానాలు మెరుగుపరుచుకుని 22వ స్థానాన్ని అందుకోగా.. ప్రసిద్ధ్ కృష్ణ ఏకంగా 34 స్థానాలు ఎగబాకి 58వ ర్యాంకును దక్కించుకున్నాడు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ 71వ స్థానంలో నిలిచాడు.

**టెస్టుల్లో జో రూట్, మ్యాట్ హెన్రీల హవా:**

టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ మళ్లీ నెంబర్ 1 బ్యాటర్‌గా అవతరించాడు. ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ అగ్రస్థానం కోల్పోయి రెండో స్థానంలో నిలిచాడు. న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో జో రూట్ 14 వేల పరుగుల మైలురాయిని అందుకొని, సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ ఫీట్ సాధించిన ఏకైక బ్యాటర్‌గా చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే.

మరోవైపు టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో కివీస్ ఫాస్ట్ బౌలర్ మ్యాట్ హెన్రీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో 11 వికెట్లతో చెలరేగిన హెన్రీ.. టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి సంయుక్తంగా నంబర్ వన్ స్థానాన్ని పంచుకున్నాడు. న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలో సుదీర్ఘ కాలం (36 ఏళ్ల) తర్వాత టెస్టుల్లో నంబర్ వన్ ర్యాంకు సాధించిన మూడో ఫాస్ట్ బౌలర్‌గా 34 ఏళ్ల మ్యాట్ హెన్రీ రికార్డు సృష్టించాడు.

## ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెటర్ అభిషేక్ పోరెల్‌పై కేసు..

**పెళ్లి పేరుతో మోసం చేశాడని మహిళ ఫిర్యాదు!**

**మూడేళ్లుగా రిలేషన్ షిప్, తనపై దాడి కూడా చేశాడని ఆరోపణ.. స్పందించిన బెంగాల్ వికెట్ కీపర్!**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ వికెట్ కీపర్, బ్యాటర్ అభిషేక్ పోరెల్ చుట్టూ తీవ్ర వివాదం ముసురుకుంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మూడేళ్లుగా శారీరక సంబంధం పెట్టుకుని.. ఆపై మోసం చేశాడంటూ ఓ మహిళ అతనిపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ మేరకు పశ్చిమ బెంగాల్లోని హుగ్లీ జిల్లా మొగ్రా పోలీస్ స్టేషన్లో బాధిత మహిళ తన తల్లితో కలిసి వెళ్లి సదరు క్రికెటర్‌పై ఫిర్యాదు చేసింది. పెళ్లి పేరుతో మోసం చేయడమే కాకుండా.. తనపై దాడికి పాల్పడ్డాడని, బెదిరింపులకు గురిచేశాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది.

పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం.. సదరు మహిళ, అభిషేక్ పోరెల్ గత మూడేళ్లుగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. కొంతకాలం పాటు వీరి బంధం బాగానే సాగినప్పటికీ.. 2025లో ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడం ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత అభిషేక్ పోరెల్ ఆమెకు క్రమక్రమంగా దూరమయ్యాడు. బాధితురాలు పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పుడు నిరాకరించడమే కాకుండా.. వివాదానికి దిగడంతో ఈ వ్యవహారం కాస్తా పోలీస్ స్టేషన్ వరకు చేరింది. ప్రస్తుతం మొగ్రా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

తనపై వచ్చిన ఆరోపణలను 23 ఏళ్ల అభిషేక్ పోరెల్ తీవ్రంగా ఖండించాడు. తాను క్రికెట్లో రాణిస్తూ మంచి ఫామ్‌లో ఉన్నందుకే కొందరు కావాలనే తన పేరును వివాదాల్లోకి లాగుతున్నారని అన్నాడు. "నేను ప్రస్తుతం బాగా ఆడుతున్నాను, అందుకే ఇలాంటి విషయాలను తెరపైకి తెస్తున్నారు. పోలీసుల విచారణ పూర్తి కాగానే ఈ విషయంపై నేను పూర్తి వివరంగా మాట్లాడతాను. ఇప్పటివరకు పోలీసుల నుంచి నాకు ఎలాంటి సమాచారం రాలేదు" అని అభిషేక్ పోరెల్ స్పష్టం చేశాడు.

క్రికెట్ విషయానికి వస్తే.. ఐపీఎల్ 2026 సీజన్లో అభిషేక్ పోరెల్‌కు పెద్దగా అవకాశాలు దక్కలేదు. ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడిన 4 ఇన్నింగ్స్‌ల్లో ఒక హాఫ్ సెంచరీతో కలిపి 108 రన్స్ చేశాడు. అయినప్పటికీ ఫ్రాంచైజీ అతడి ప్రతిభను నమ్మి రూ. 4 కోట్లకు రీటైన్ చేసుకుంది. ఆ తర్వాత జరిగిన బెంగాల్ ప్రో టి20 లీగ్‌లో 6 మ్యాచ్‌ల్లో 275 పరుగులతో అద్భుత ప్రదర్శన చేశాడు. 2022లో బెంగాల్ జట్టు తరపున డొమెస్టిక్ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన పోరెల్.. ఇప్పటివరకు 32 ఫస్ట్ క్లాస్, 23 లిస్ట్–ఎ మ్యాచ్‌లు ఆడాడు. ప్రస్తుతం ఈ కేసు పోలీస్ దర్యాప్తులో ఉంది.

# నేడు బంగ్లాదేశ్‌తో భారత్ ఢీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



వరుస విజయాలతో మహిళల టీ20 ప్రపంచకప్‌లో జోరు కొనసాగిస్తున్న భారత మహిళల క్రికెట్ జట్టు గురువారం జరిగే కీలక మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. గ్రూప్–ఏలో భాగంగా జరిగే ఈ పోరులో విజయం సాధించి సెమీస్ అవకాశాలను మరింత బలోపేతం చేసుకోవాలని హర్మన్‌ప్రీత్ కౌర్ సేన లక్ష్యంగా పెట్టుకుంది.

మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించిన భారత్ నాలుగు పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఎనిమిది పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ జట్లు కూడా నాలుగు పాయింట్లతో పోటీలో ఉన్నాయి. అయితే నెట్ రన్‌రేట్ విషయంలో భారత్ (ం2.511) ఆధిక్యంలో ఉండటం జట్టుకు కలిసొచ్చే అంశంగా మారింది.

గత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయం పాలైన టీమ్ఇండియా మళ్లీ విజయాల బాట పట్టేందుకు పట్టుదలగా ఉంది. బంగ్లాదేశ్‌పై భారీ తేడాతో విజయం సాధిస్తే సెమీస్ అవకాశాలు మరింత మెరుగుపడనున్నాయి.

లీగ్ దశలో చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాపై వరుస విజయాలు సాధిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా భారత జట్టు నేరుగా సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. అయితే ఒక మ్యాచ్‌లోనైనా ఫలితం తేడా కొడితే నాకౌట్ అవకాశాలు సంక్లిష్టం కావచ్చు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌పై భారీ విజయమే లక్ష్యంగా హర్మన్‌ప్రీత్ అండ్ కో. బరిలోకి దిగనుంది.

# వరంగల్ వారియర్స్ ఘన విజయం



**హర్షిత్ చౌదరి వీరోచిత సెంచరీ (121 నాటౌట్)..**

**ఖమ్మంపై వరంగల్ గ్రాండ్ విక్టరీ!**

**బలగం టీవీ, హైదరాబాద్**

టీజీ20 క్రికెట్ లీగ్‌లో బుధవారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో వరంగల్ వారియర్స్ జట్టు ఘన విజయం సాధించింది. అన్విత ఖమ్మం ఏసెస్ నిర్దేశించిన 203 పరుగుల భారీ లక్ష్యాన్ని వరంగల్ బ్యాటర్లు మరో 7 బంతులు మిగిలి ఉండగానే ఛేదించారు. వరంగల్ ఇన్నింగ్స్‌ను ఒంటిచేత్తో నడిపించిన స్టార్ బ్యాటర్ హర్షిత్ చౌదరి విధ్వంసకర సెంచరీతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

**చేతులెత్తేసిన ఖమ్మం బౌలర్లు.. హర్షిత్ సిక్సర్ల వర్షం:**

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వరంగల్ వారియర్స్‌కు ప్రారంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. వికెట్లు పడుతున్నా ఒకవైపు క్రీజులో పాతుకుపోయిన హర్షిత్ చౌదరి (121 నాటౌట్) ఖమ్మం బౌలర్లపై నిర్దయాత్మకంగా విరుచుకుపడ్డాడు. మైదానం నలుమూలలా బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ కేవలం 62 బంతుల్లోనే 11 ఫోర్లు, 7 సిక్సర్లతో అజేయంగా 121 పరుగులు సాధించి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అతనికి తోడుగా రుషికేశ్ సిసోడియా (27) బాధ్యతాయుతంగా ఆడి సహకారం అందించాడు. దీనితో వరంగల్ జట్టు 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి విజయతీరాలకు చేరింది. ఖమ్మం బౌలర్లలో సాకేత్ ధాత్రక్ రెండు వికెట్లు పడగొట్టగా.. మిలింద్, మహేశ్, వేద్‌రెడ్డిలకు తలో వికెట్ దక్కింది.

**మయాంక్, మికిల్ రాణించినా..**

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అన్విత ఖమ్మం ఏసెస్ జట్టు 19.2 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ వాఫీ కచ్చీ (17) త్వరగానే అవుటైనా.. మయాంక్ గుప్తా (54) బాధ్యతాయుత అర్ధ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఆ తర్వాత మిడిల్ ఆర్డర్‌లో మికిల్ జైస్వాల్ కేవలం 22 బంతుల్లోనే 54 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. హిమతేజ (23), ప్రతీక్ రెడ్డి (20) పరుగులతో రాణించారు.

**చివర్లో వరంగల్ బౌలర్ల విజృంభణ:**

ఒక దశలో భారీ స్కోరు దిశగా దూసుకెళ్తున్న ఖమ్మం జట్టును వరంగల్ బౌలర్లు చివర్లో దెబ్బకొట్టారు. కెప్టెన్ సివి మిలింద్ (11) అవుటైన తర్వాత ఖమ్మం వరుసగా వికెట్లు కోల్పోయింది. విశాల్ యాదవ్ (0), విద్యానంద రెడ్డి (6), సాయి వెంకట్ (2) తక్కువ పరుగులకే పెవిలియన్ చేరారు. వరంగల్ బౌలర్లలో మహ్మద్ అబ్దుల్ మాలిక్, అభిషేక్ చెరో 3 వికెట్లతో ఖమ్మం నడుము విరవగా.. క్రాంతి పల్లెపాటి రెండు, మదస్సర్ హుసేన్ ఒక వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

**స్కోరు వివరాలు:**

అన్విత ఖమ్మం ఏసెస్: 202/10 (19.2 ఓవర్లలో) (మయాంక్ 54, మికిల్ జైస్వాల్ 54; అబ్దుల్ మాలిక్ 3/సిక్స్, అభిషేక్ 3/సిక్స్)

వరంగల్ వారియర్స్: 208/5 (18.5 ఓవర్లలో) (హర్షిత్ చౌదరి 121 నాటౌట్, రుషికేష్ 27; సాకేత్ ధాత్రక్ 2/34)

# రికార్డుల రారాజు రొనాల్డో.. సరికొత్త చరిత్ర!

**41 ఏళ్ల వయసులో జోడు గోల్స్.. 24 గంటల్లోనే మెస్సీ రికార్డు బ్రేక్!**

**బలగం టీవీ, హైదరాబాద్**



: ఫుట్‌బాల్ ప్రపంచంలో పోర్చుగల్ స్టార్ ఆటగాడు, రికార్డుల రారాజు క్రిస్టియానో రొనాల్డో మరో అరుదైన మైలురాయిని అందుకుని సరికొత్త చరిత్ర సృష్టించాడు. 'ఫీఫా వరల్డ్ కప్ 2026' టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం ఉజ్బెకిస్థాన్‌తో జరిగిన గ్రూప్–కె లీగ్ మ్యాచ్‌లో రొనాల్డో విశ్వరూపం ప్రదర్శించాడు. ఈ పోరులో రెండు గోల్స్ సాధించడం ద్వారా ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక వయసులో (41 సంవత్సరాల 138 రోజులు) ఒకే మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన ఆటగాడిగా రొనాల్డో ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. వయసు కేవలం అంకె మాత్రమేనని 40 ఏళ్లు దాటిన తర్వాత కూడా తనలోని సత్తా తగ్గలేదని ఈ ప్రదర్శనతో ఆయన నిరూపించాడు.

**24 గంటల్లోనే మెస్సీ రికార్డు కనుమరుగు:**

రొనాల్డో కంటే కేవలం ఒక్క రోజు ముందు (జూన్ 22న) అర్జెంటీనా స్టార్ లయనల్ మెస్సీ (38 ఏళ్ల 363 రోజులు) ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసి ఈ రికార్డు నెలకొల్పాడు. అయితే మెస్సీ సృష్టించిన ఈ రికార్డు ఆనందం 24 గంటలు కూడా గడవక ముందే రొనాల్డో దానిని తిరగరాశాడు. అంతేకాకుండా, ఆరు వేర్వేరు ఫీఫా ప్రపంచకప్ ఎడిషన్లలో (2006 నుండి 2026 వరకు) గోల్స్ చేసిన ప్రపంచంలోని ఏకైక ఆటగాడిగా తన పాత రికార్డును తానే బద్దలు కొట్టాడు.

**యుసేబియో ఆల్‌టైమ్ రికార్డు బ్రేక్:**

ఉజ్బెకిస్థాన్‌పై చేసిన గోల్స్‌తో రొనాల్డో తన దేశం తరపున మరో ఆల్‌టైమ్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ప్రపంచకప్ చరిత్రలో పోర్చుగల్ తరపున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. రొనాల్డో ఇప్పటివరకు ఆడిన 24 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో మొత్తం 10 గోల్స్ సాధించి, అంతకుముందు పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం యుసేబియో (9 గోల్స్) పేరిట దశాబ్దాలుగా ఉన్న రికార్డును అధిగమించాడు. అయితే, అత్యధిక వయసులో 'హ్యాట్రిక్' సాధించిన రికార్డు మాత్రం ప్రస్తుతానికి లయనల్ మెస్సీ (అల్జీరియాపై హ్యాట్రిక్) పేరిటే భద్రంగా ఉంది.

**5-0తో ఉజ్బెకిస్థాన్‌పై పోర్చుగల్ లీలాజాల విజయం:**

హ్యూస్టన్‌లోని ఎన్ఆర్‌జీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో పోర్చుగల్ జట్టు 5–0 గోల్స్ తేడాతో ఉజ్బెకిస్తాన్‌ను ఊడ్చేసింది. ఆట ప్రారంభమైన 6వ నిమిషంలోనే జోయావో కాన్సెలో పాస్‌ను రొనాల్డో గోల్‌గా మలిచి ఖాతా తెరిచాడు. ఆ తర్వాత 17వ నిమిషంలో నూనో మెండిస్ అద్భుతమైన ఫ్రీ–కిక్‌తో ఆధిక్యాన్ని 2–0కి పెంచాడు. 39వ నిమిషంలో బ్రూనో ఫెర్నాండెజ్ ఇచ్చిన పాస్‌తో రొనాల్డో వ్యక్తిగత రెండో గోల్ కొట్టడంతో మొదటి సగంలోనే పోర్చుగల్ 3–0తో నిలిచింది. అనంతరం ద్వితీయార్థంలో 60వ నిమిషంలో ఉజ్బెకిస్థాన్ డిఫెండర్ ఓన్ గోల్ కారణంగా పోర్చుగల్‌కు 4వ గోల్ లభించగా, మ్యాచ్ ముగిసే సమయానికి (87వ నిమిషంలో) రాఫెల్ లియావో పెనాల్టీ ఏరియా నుండి మరో గోల్ బాది 5–0తో చారిత్రాత్మక విజయాన్ని ఖరారు చేశాడు.

**సంక్షిప్త స్కోర్లు:**

పోర్చుగల్: 5 గోల్స్ (రొనాల్డో 6వ, 39వ నిమిషం, నూనో మెండిస్ 17వ నిమిషం, ఓన్ గోల్ 60వ నిమిషం, రాఫెల్ లియావో 87వ నిమిషం)

ఉజ్బెకిస్థాన్: 0 గోల్స్.

## వైభవ్ సూర్యవంశీకి ఇంగ్లండ్ టూర్‌లో ప్రత్యేక ఏర్పాట్లు!

**16 ఏళ్ల లోపు నిబంధనల కారణంగా స్పెషల్ చేంజింగ్ రూమ్.. వెంట వెళ్లనున్న తల్లిదండ్రులు!**

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత క్రికెట్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఇంగ్లండ్ పర్యటనలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుంచి ప్రత్యేక ప్రోత్సాహం, లగ్జరీ ట్రీట్‌మెంట్ లభించనుంది. వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో జరగనున్న ఐదు టీ20ల సిరీస్‌కు ఎంపికైన ఈ కుర్రాడి భద్రత, సౌకర్యార్థం బీసీసీఐ సరికొత్త ఏర్పాట్లు చేస్తోంది. వయసు రీత్యా చిన్నవాడు కావడంతో వైభవ్ తోడుగా అతడి తల్లిదండ్రులను కూడా ఇంగ్లండ్‌కు పంపించేందుకు బోర్డు నిర్ణయించింది. అలాగే సిరీస్ జరిగే అన్ని వేదికల్లోనూ ఈ యువ ఆటగాడికి ప్రత్యేక చేంజింగ్ రూమ్‌ను కేటాయించనున్నారు.

**ఐసీసీ, ఈసీబీ రూల్స్ వల్లే ఈ నిర్ణయం:**

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ), ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) కఠిన నిబంధనల ప్రకారం.. 16 ఏండ్ల లోపు వయసున్న మైనర్ ఆటగాళ్లను పెద్దల (సీనియర్ల) చేంజింగ్ రూమ్స్‌లోకి అనుమతించరు. ఈ చట్టపరమైన నిబంధనలను గౌరవిస్తూ బీసీసీఐ వైభవ్‌కు ప్రత్యేక రూమ్స్ ఏర్పాటు చేస్తోంది. అయితే, మ్యాచ్ జరుగుతున్న సమయంలో అతడు టీమిండియా ప్రధాన డ్రెస్సింగ్ రూమ్‌లోనే ఉంటూ.. జట్టు వ్యూహాత్మక సమావేశాల్లో (టీమ్ మీటింగ్స్) పాల్గొనే అవకాశం ఉంటుంది. కేవలం దుస్తులు మార్చుకునే సమయంలో మాత్రమే అతడు తనకు కేటాయించిన ప్రత్యేక రూమ్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. భారత సీనియర్ జట్టుతో కలిసి విదేశీ పర్యటనకు వెళ్తున్న అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడిగా వైభవ్ ఈ పర్యటనలో సరికొత్త అనుభవాన్ని సొంతం చేసుకోనున్నాడు